నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ

అల్పాహారం నాణ్యతపై ఆరా..

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని రాకాసిపేట్‌లోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం డీఈవో దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో హాజరై విద్యార్థులతో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమం బోధన్ నియోజకవర్గంలోని బోధన్ పట్టణంలో గల గాంధీ నగర్ ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తుండడంతో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అల్పాహారం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహారం కార్యక్రమం రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగనాథ్ ఉన్నారు.

మహిళలే మహా శక్తివంతులు

- ఐసిఈయూ నేత డి.ఎస్.రఘు

నవతెలంగాణ-నిజామాబాద్

మహిళలే మహా శక్తివంతులు అని ఐసిఈయూ నేత డి.ఎస్.రఘు అన్నారు. ఎల్ఐసికి చెందిన ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) బోధన్, నిజామాబాద్ బ్రాంచ్‌ల జనరల్ బాడీ సమావేశం గురువారం ఎల్లమ్మగుట్టలోని ఏటీసీ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ డి ఎస్ రఘు మాట్లాడుతూ.. సంస్థ లాభాల్లో ఉంటేనే ఉద్యోగుల భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. సమావేశంలో ఐసిఈయు డివిజన్ అధ్యక్షులు ఎం.ఎన్.శ్రీనివాసులు, జిల్లా సంయుక్త కార్యదర్శి రాజేష్, శ్రావణ్, బ్రాంచ్ అధ్యక్షులు సక్కి ఆనంద్, కార్యదర్శి సక్కి సత్యనారాయణ, బోధన్ బ్రాంచ్ అధ్యక్షులు నర్సయ్య, కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఓటర్లు 1,97,897 మంది

- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- ఏడు మండలాల పరిధిలో 255 పోలింగ్ బూతులు
- ఓటర్ల నాడిని అంచనా వేస్తున్న పార్టీల నాయకులు

నవతెలంగాణ-మద్నూర్



తెలంగాణ రాష్ట్రంలోని రాష్ట్ర సరిహద్దుల గల జుక్కల్ ఎస్సీ రిజర్వ్‌డు నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 1,97,897 మంది ఉన్నట్లు మద్నూర్ మండల తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాల పరిధిలో 255 పోలింగ్ బూతులు ఉన్నట్లు ఆయన తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో ఇటీవల మహ్మద్‌నగర్ కొత్త మండలంగా ఏర్పడినప్పటికీ ఓటర్ల సంఖ్య నివేదిక ప్రకారం.. 7 మండలాల పరిధిలో బూతుల సంఖ్య, ఓటర్ల సంఖ్య, అందులో పురుషులెంత, మహిళలు ఎంత అనే వివరాలు తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న ఉన్నదున జుక్కల్ నియోజకవర్గంలో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రజల నాడీని పట్టుకునే పనిలో పడ్డారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య1,97,897 మందిఉండగా.. వీటిలో పురుషుల ఓటర్ల సంఖ్య 97,618, కాగా మహిళా ఓటర్ల సంఖ్య 1,00,269. ఉన్నారు. ఈ సంఖ్య ప్రకారం మహిళా ఓటర్లు పురుషుల కంటే 2651 మంది అధికంగా ఉన్నారు. ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ఆషామాషీ కావని గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పట్టుదలతో ఓటర్లను ఆకర్షించే విధంగా పనిచేస్తేనే గెలుపు ఖాయం అనే ధీమాతో ఓటర్ల నాడిపై పార్టీల నాయకులు అంచనాలు బేరీజు వేస్తున్నారు. ఏది ఏమైనా ఈ సారి ఓటర్లు ఏ పార్టీకి మొగ్గుచూపుతారో వేచి చూడాల్సిందే.

గ్యాస్ ధర రూ.977.. వసూలు రూ.1020

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలో భారత్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 977 ఉంటే సరాఫరా చేసే సిబ్బంది మాత్రం వినియోగదారుల నుండి అధికంగా రూ.1020 వసూలు చేస్తున్నారు. వినియోగదారులు బిల్లు కంటే ఎక్కువగా ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే ఇంటివద్దకు తీసుకొచ్చినందుకు రూ. 43 ఎక్కువగా తీసుకుంటున్నట్టు వారు తెలిపారు. ఒక దిక్కు కేంద్ర ప్రభుత్వం రూ.200 గ్యాస్ ధర తగ్గించినా లాభం లేదని ప్రజలు వాపోతున్నారు. భారత్ గ్యాస్ ఏజన్సీపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏటీఎం చోరీ నిందితుల పట్టివేత

- బైకు, 12 గ్రాముల బంగారం, రూ.80 వేల నగదు స్వాధీనం

నవతెలంగాణ-భీంగల్



వివరాలు వెల్లడిస్తున్న ఇంచార్జి సీపీ

మండలంలోని బడా భీంగల్ గ్రామంలో గల ఇండియా నెంబర్‌వన్ ఏటీఎంలో చోరీ కేసులో జక్రాన్ పల్లి మండల కేంద్రానికి చెందిన అల్లెపు స్వామి, అల్లెపు దేవేందర్, అల్లెపు శైలజ, ఆర్మూర్‌కు చెందిన నర్ర నవీన్ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నిందితులను భీంగల్ పట్టణ కేంద్రంలోని ముచ్కూర్ చౌరస్తా వద్ద పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు ఇంచార్జి సిపి జయరాం తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్మూర్ ఎసిపి జగదీష్ చందర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. పాత నేరస్తులైన అల్లెపు స్వామి, నర్ర నవీన్, దేవేందర్ ఈ నెల 8, 9న ఆర్మూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో అర్ధరాత్రి ఫ్యాషన్ ప్రో బైక్‌ను దొంగతనం చేసి అదే బైకుపై చెంగల్ మీదుగా బడా భీంగల్ చేరుకొని అక్కడ ఖాళీ స్థలంలో ఎవరూ గుర్తుపట్టకుండా ఉండటానికి తమతో తెచ్చుకున్న నల్లని రంగు గల జెర్కిన్‌లు, చేతులకు గ్లౌజ్‌లు, తలకి హెల్మెట్ ధరించి ఇండియా నెంబర్ వన్ ఏటీఎం ఎదురుగా ఉన్న గల్లీ వద్ద బైకును పక్కకు ఆపుకున్నారు. చుట్టూ పక్కల ఎవరు రాకుండా నిందితులలో దేవేందర్ అనే వ్యక్తి గమనించుకుంటూ ఉండగా అల్లేపు స్వామి, నర్ర నవీన్ వారి వెంట తెచ్చుకున్న ఇనుప రాడులు తీసుకుని ఏటీఎం వద్దకు వెళ్లి ముందుగా సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి, కెమెరాలకు నల్లని రంగు పూసి, లోపలి వెళ్లి తమతో తెచ్చుకున్న ఇనుపరాడ్‌లతో ఏటీఎం మెషిన్‌ను పగలగొట్టేందుకు ప్రయత్నిస్తుండగా చుట్టూ పక్కల వారు అరుస్తున్నట్లు అరుపులు వినబడేసరికి పరారయ్యారు. మరుసటి రోజు వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో గల యూనియన్ బ్యాంక్ ఎటిఎంలో దోపిడీ యత్నానికి పన్నాగం పన్నారు. ఇందులో భాగంగానే పై ముగ్గురు నిందితులు యధావిధిగా బైకుపై అర్ధరాత్రి జర్కిన్ హెల్మెట్ చేతి గ్లౌజులు వేసుకొని గ్రామంలోకి వెళ్లి ముందుగా గ్రామపంచాయతీ వద్ద ట్రాక్టర్‌ను దొంగలించి ఏటీఎం ముందర నిలిపి మిషన్‌లో ట్రాక్టర్ ద్వారా ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా చుట్టుపక్కల అరుపులు వినిపించడంతో పరారయ్యారు. ఈ ఘటనపై భీంగల్, ఆర్మూర్, వేల్పూర్ పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదు నమోదు చేసి భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు, భీంగల్ ఎస్సై హరిబాబు, కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగానే గురువారం ఉదయం భీంగల్ పట్టణ కేంద్రంలోని ముచ్కూర్ చౌరస్తా వద్ద ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన ముగ్గురు నిందితులు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకొన్నారు. పత్రాలు లేకపోవడంతో బైకులో పరిశీలించగా అందులో జర్కిన్‌లు, చేతి గ్లౌజులు, నల్లని రంగు డబ్బాలు ఉన్నాయి. పైగా ఏటీఎంలో చివరి యత్నానికి ప్రయత్నించిన నిందితుల ముఖ కవళికలు సీసీ కెమెరా ద్వారా సేకరించిన వాటికి పోలి ఉండడంతో విచారించగా బడా భీంగల్ అంక్సాపూర్ గ్రామాలలోని ఏటీఎం దొంగతనానికి యత్నించినట్లు ఒప్పుకున్నారు. అన్నదమ్ములైన నిందితులు అల్లేపు స్వామి,-అల్లేపు దేవేందర్‌లు బావమరిది అయినా మరో నిందితుడు నర్ర నవీన్. రాత్రి వేళల్లో తాళం వేసిన ఇండ్లల్లో తాళం పగలగొట్టి చోరీ చేసి ఆ బంగారమును స్వామి భార్య అల్లేపు శైలజ ద్వారా అమ్మితే ఎవరు కూడా గుర్తు పట్టరని అనుకున్నారు. ఇందులో భాగంగా అల్లేపు స్వామి, నవీన్ ఇద్దరూ కలిసి ఆగస్టు నెలలో వేల్పూర్ మండలంలోని జన్కంపేట్ గ్రామంలో, ఇండ్లల్లో తాళాలు పగులగొట్టి దొంగంతనం చేశారని, సెప్టెంబర్ 19న రాత్రి సమయములో కుకునూర్, వేల్పూర్‌లో రెండు ఇండ్లల్లో దొంగతనాలు చేసి బంగారు, వెండి ఆభరణాలను, నగదు దొంగలించి శైలజకు ఇచ్చినట్లు వారు ఒప్పుకున్నారు. గతంలో వీరు జక్రాన్‌పల్లి, నిర్మల్, ధర్మారం, నిజామాబాద్ పట్టణంలో బాల్కొండ, ఆర్మూర్ పరిధిలో దొంగతనాలు చేసి 19 కేసులలో జైలుకి కూడా వెళ్లి వచ్చారు. అల్లెపు స్వామి, దేవేందర్, నర్ర నవీన్ వద్ద నుండి ఫ్యాషన్ ప్రో బైక్, 40 వేల నగదు, అల్లపు శైలజ వద్ద ఒక తులం బంగారు చైను, రెండు గ్రాముల చాకటి గుండ్లు, 40 వేల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సిపి తెలియజేశారు. ఈ కేసులలో చాకచక్యంగా వ్యవహరించిన భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు, భీంగల్, కమ్మర్‌పల్లి ఎస్సై లుహరిబాబు, రాజశేఖర్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, రంజిత్, తిరుమలేష్, రఘువీర్, సుదీర్, మనోజ్, రాజ, సంపత్, గంగప్రసాద్‌ను సిపి జయరాం అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఎసిపి జగదీష్ చందర్, సిసిఎస్ ఏసీపీ విజయ సారథి, సిఐపి రమేష్ తదితరులున్నారు.

సెలవులతో విద్యార్థులు ఇంటికి..

రోడ్డుపై ట్రాఫిక్

నవతెలంగాణ-మాక్లూర్



రోడ్డుపై నిలిచిన వాహనాలు

మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల జిల్లా గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాల, జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థినీలను దసరా సెలవులకు గురువారం ఇంటికి తీసుకు వెళ్లడానికి విద్యార్థినీల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. పెట్ట, బ్యాగులతో విద్యార్థినిలు రోడ్డు పైకి రావడంతో ఒక్కసారిగా రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు ఒక గంట పాటు ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వాహనాలను క్రమ పద్ధతిలో పంపడానికి పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో నందిపేట్, దాస్‌నగర్ రోడ్డు రద్దీగా మారింది.

ఆర్టీసీలో ప్రయాణిస్తే బహుమతులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణీకులకు నగదు బహుమతులను గెలుపొందే అద్భుత అవకాశాన్ని టియస్ఆర్టీసి కల్పించినట్టు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కె.జానారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రయాణం పూర్తి అయ్యాక తమ టికెట్ వెనకాల మీ ఆధార్‌కార్డు నందు ఉన్న పూర్తి పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్ స్టాండ్ లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ డ్రాప్‌బాక్స్‌లో వేయాలని తెలిపారు. డ్రా లో గెలుపొందిన 5 గురు మహిళలకు, 5 గురు పురుషులకు ఒక్కొక్కరికి 9900 రూపాయల చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు. ఈ నెల 21 నుండి 23 వరకు మళ్లీ ఈనెల 28 నుండి 30 వరకు టియస్ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే ప్రతి ఒక్క ప్రయాణికుడు, ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఈ లక్కీ డ్రాలో పాల్గొనటానికి అర్హులని అన్నారు. అలాగే గత నెల 20 నుండి 30 మధ్య ప్రయాణం చేసి ఈనెల 15 నుండి 29 మధ్య తిరుగు ప్రయాణం టిక్కెట్లను బుక్ చేసుకునే ప్రయాణీకులకు, తిరుగు ప్రయాణ టిక్కెట్‌పై 10 శాతం తగ్గింపు కల్పించబడునని పేర్కొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మాట్లాడుతున్న ఎంపీపీ

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుంచాల విమల రాజు ఆధ్వర్యంలో గురువారం సాధాసీదాగా జరిగింది. వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ, పౌరసరఫరాల, సాగునీటి పారుదల, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ, విద్య గ్రామీణ తాగునీటి, నర్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్, పశు పోషణ తదితర శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీఓ యుసఫ్‌ఖాన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యుడు బుల్లెట్ అక్బర్‌ఖాన్, స్థానిక వైద్య అధికారి డాక్టర్ రవీందర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి డాక్టర్ అఖిల్, మండల పశువైద్య అధికారి శిరీష, ఆయుర్వేదిక్ అధికారి లలిత, ఎపిఓ రవి, ఆర్ఐ ప్రవీణ్, ఏపియం రవీందర్, సంతోష్, రాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మథర్ తెరిస్సా హైస్కూల్, శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బాల్కొండలోని నెహ్రూనగర్, బస్టాండ్, వినాయక్‌నగర్, సపిల్‌కట్ట, దాస్ సిన్మాన్‌గల్లీ, మార్కెట్‌ల మీదుగా కొనసాగింది. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు బతుకమ్మ పాటలు, నత్యాలతో ఊరేగింపు ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కే.రామలక్ష్మి హెడ్మాస్టర్లు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

- రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఓ వ్యక్తికి సంబంధించిన భూమి వివరాలను ధరణిలో మార్చేందుకు రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా నిజామాబాద్ దక్షిణ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజును ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల సౌత్ ఎమ్మార్వో కార్యాలయంలో వీఆర్‌వో సతీష్ ద్వారా లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన బంటు రామారాజు తన సొంత పట్టాభూమి సర్వే నంబర్ 2944లో 16 గుంటల వ్యవసాయ భూమి ఉంది. వారసత్వంగా వచ్చిన సంబంధిత భూమి విషయంలో దాయాదులకు సంబంధించి సివిల్ సూట్ పెండింగ్‌లో ఉండడంతో రామారాజుకు సంబంధం లేకుండా అతని సర్వే నంబర్‌ను పొరపాటున నిషేధిత భూముల జాబితాలో నమోదయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా అసలైన యజమానులకు భూముల హక్కులు కల్పించేందుకు తెచ్చిన ఈ పోర్టల్‌లో రామారాజు తన భూమిని నిషేధిత జాబితా నుంచి తీసివేయాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. నిజామాబాద్ దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించారు. ఈ విషయంలో తహసీల్దార్ సూచన మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజును సంప్రదించాడు. ధరణి పోర్టల్‌లో మార్పులు చేయాలంటే రూ.20 వేలు ఖర్చు అవుతుందని రాజు డబ్బులు డిమాండ్ చేశారు. దానికి రామారాజు ఒకే అన్నాడు. తర్వాత కాలంలో అంత డబ్బులు ఇచ్చుకోలేనని తగ్గించాలని కోరడంతో రాజు పేపర్‌పై రూ.8వేలు ఇస్తేనే పని జరుగుతుందని తేల్చిచెప్పారు. సంబంధిత డబ్బులు తన కార్యాలయంలో తన వద్ద పనిచేస్తున్న వీఆర్వో మంత్రి హరీష్‌కు ఇవ్వాలని సూచించారు. ఈ విషయంపై బాధితుడు రామారాజు ఏసీబీని ఆశ్రయించారు.

ఏసీబీ అధికారులు బాధితుని వాంగ్మూలం ప్రకారం కేసు నమోదు చేసి పథకాన్ని రచించారు. గురువారం ఎల్లమ్మగుట్టలోని దక్షిణ మండల తహసీల్దార్ కార్యాలయంలో రామారాజు కవర్‌లో ఉంచిన రూ.8వేలను వీఆర్వో హరీష్ చేతికి అందజేశారు. అతని నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంబంధిత డబ్బులు ఉన్న కవర్ తీసుకోగానే ఏసీబీ డీఎస్పీ ఆనంద్, సిఐలు శ్రీనివాస్, నగేష్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు కార్యాలయంలో రికార్డులను తనిఖీలు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆర్.ఐ.రాజు, వీఆర్వో హరీష్‌ను రిమాండ్‌కు పంపుతామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

375 మంది విద్యార్థినీలు.. 6 మరుగుదొడ్లు

విద్యార్థినులకు ఇబ్బందవుతోందని కాంట్రాక్టర్‌ను, సిబ్బందిని నిలదీసిన తల్లిదండ్రులు

నవతెలంగాణ-బిచ్కుంద



సిబ్బందిని నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు నెలకొల్పి నాణ్యమైన విద్యా బోధన, పౌష్టికారంతో కూడుకున్న భోజనాన్ని అందిస్తూ పాఠశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నది. అంతవరకు బాగానే ఉన్నా.. బిచ్కుంద మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు 375 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తుండగా వీరితోపాటు 17 మంది టీచింగ్ స్టాఫ్, 10 మంది వర్కర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. విద్యార్థినులు, టీచింగ్ స్టాఫ్, వర్కర్లు మొత్తం కలిపి 402 మందికి నూతన భవనంలో నిర్మించిన ఆరు మరుగుదొడ్లు వాడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా సెలవుల సందర్భంగా గురువారం విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయగా పాఠశాలలో 375 విద్యార్థులకు గానూ 6 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని దీంతో పాటు తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని విద్యార్థునులు అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ప్రత్యేక అధికారిని రాగిణితో వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వం 2 కోట్ల 5 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించగా అందులో మిగిలిన నిధులతో పాత భవనంలోని మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, తదితర పనులు కోసం ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని కాంట్రాక్టర్ పాత వాటిని తొవ్వివేసి పనులు పూర్తి చేయడం లేదని ఎక్కడికక్కడ తవ్విన వాటిని అలాగే వదిలి వేయడంతో పాములు లోపలికి వస్తున్నాయని ఇబ్బందుల విషయం కాంట్రాక్టర్ దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులకు ప్రత్యేక అధికారిని రాగిణి తెలిపారు. కాంట్రాక్ట్‌ను పిలిపించే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని తల్లిదండ్రులు భీష్మించుకూర్చోవడంతో కాంట్రాక్టర్‌ను పిలిపించగా ప్రభుత్వం ద్వారా తనకు రావలసిన బిల్లులు సకాలంలో రావడం లేదని సంబంధిత సర్వశిక్ష అభియాన్ ఏఈ పనులను పరిశీలించడానికి రావడం లేదని దసరా సెలవుల్లో పనులు పూర్తి చేస్తానని కాంటాక్ట్ తెలిపారు. దసరా సెలవులు పూర్తయ్యేలోపు పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేపట్టిన పనులు పూర్తిచేయాలని లేకుంటే విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులు పాఠశాల ముందు బైఠాయించి ఆందోళన చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈ విషయంపై సర్వ శిక్ష అభియాన్ ఏఈ మురళిని ఫోన్లో సంప్రదించగా మిగులు నిధులు 35 లక్షల రూపాయలతో పాత భవనంలోని ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ వర్క్స్ తదితర పనులు చేపట్టడానికి మంజూరు చేసినట్టు తెలిపారు. తను పాఠశాలను సందర్శించి చేపట్టబోయే పనులను పరిశీలించి త్వరలో కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. 2 కోట్ల 5లక్షల నిధులలో ఇప్పటివరకు ప్రభుత్వం నుండి కాంట్రాక్టర్‌కు ఎంత బిల్లు ఇచ్చారని అడగగా తాను చార్జి తీసుకుని ఆరు నెలలే అవుతుందని ఆ వివరాలు తన వద్ద లేవని అనడం కొసమెరుపు.

కాంగ్రెస్ వస్తేనే.. సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్‌రెడ్డి
- ఏర్గట్లలో ఎన్నికల ప్రచారం షురూ

నవతెలంగాణ-ఏర్గట్ల



ప్రచారంలో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. ఏర్గట్ల మండలకేంద్రంలో ఆయన గురువారం పర్యటించారు. అంతకుముందు మండలకేంద్రంలో గల నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపొంది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత పథకాలు అమలుచేస్తామని అన్నారు. రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ, పసుపుకు మద్దతు ధర, ఏడాదికి ఎకరానికి 15 వేల రైతు బంధు, భూమిలేని ఉపాధి కూలీలకు 12 వేల రూపాయలు, ఆరోగ్యశ్రీ లో 5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం, 4వేల రూపాయల పింఛన్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిపిసిసి సంయుక్త కార్యదర్శి వేణు యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దేవరెడ్డి, రైతు నాయకులు ఆడేం గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే ప్రతి గజానికి పట్టాలిస్తాం

- మాజీమంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-రామారెడ్డి

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, పోడు భూముల్లో వ్యవసాయం చేస్తున్న ప్రతి గజానికి రైతు లకు పట్టాలనందిస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. గురువారం మండలంలో మద్దికుంటలో హాత్ సే హాజోడో యాత్ర నిర్వహించారు. శ్రీ స్వయం భూ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మద్దికుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..... గజ్వేల్ కెసిఆర్ శకం ముగిసిందని, కామారెడ్డిలో భూములు ఆక్రమించడానికి వస్తున్నాడని, ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత జంగంపల్లి, అంబారిపేట్, గూడెం పరిసరాల్లో భూములను ఆక్రమించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను ముందు వరుసలో అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నర్సాగౌడ్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సల్మాన్, నాయకులు లచ్చిరెడ్డి, బండి ప్రవీణ్, పెండ్యాల నర్సారెడ్డి, గజ్జల చిన్నరాజు, అన్నారం దయానంద్, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి దసరా సెలవులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పాఠశాలలకు ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు దసరా సెలవులు శుక్రవారం నుంచి దసరా సెలవులు ఉన్నాయని మండల విద్యాశాఖాధికారి యూసఫ్ గురువారం తెలిపారు.

పూల వేడుక.. బతుకమ్మ

- హోవార్డ్ ప్రిన్సిపాల్ డా.టీ.ఎస్.శశికళ

నవతెలంగాణ-నిజామాబాద్



పూల వేడుక.. బతుకమ్మ పండుగ అని హోవార్డ్ ప్రిన్సిపాల్ డా.టీ.ఎస్.శశికళ అన్నారు. న్యాల్కల్ రోడ్ రోటరీనగర్ నందుగల హెూవార్డ్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ టీవిఆర్ మూర్తి, ప్రిన్సిపాల్ డా.టి.ఎస్. శశికళ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థినీలు సాంప్రదాయ దుస్తులలో దాండియా కోలాటలతో ఆడిపాడారు.



ఐక్య పోరాటం ద్వారానే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకారం

- తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి

వివరాలు మెయిన్‌లో..

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మాతృవియోగం

- తల్లి మరణ వార్త తెలిసి బోరున విలపించిన మంత్రి..
- నేడు వేల్పూర్‌లో అంత్యక్రియలు

వివరాలు మెయిన్‌లో..

16వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్ష


రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రిలే నిరాహారదీక్ష 16వ రోజుకు చేరుకుంది. ఎలక్షన్ కోడ్ రావడంతో కోడ్ నిబంధనలు పాటిస్తూ ధర్నాచౌక్‌లో 16వ రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ రిలే నిరాహార దీక్షకు నిజామాబాద్ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయ వ్యవస్థ ఇచ్చే తీర్పు నమ్మాలో నమ్మరాదో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ రేంజర్ల సురేష్, కొయేదీ నర్సింలు, బొబ్బ నరసింహ, కల్లేదా గంగాధర్, ముదిరాజ్ శంకర్, అంబిక సత్యనారాయణ, గోపి ధర్మారం, రాజేశ్వర్, రాజేశ్వర్ గుప్త, రవికుమార్ పాటిల్, రఫీక్ ఖాన్, లక్ష్మి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని పెంటాఖుర్ద్ గ్రామంలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పర్యవేక్షణలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. పంట కోత ప్రయోగం రైతు మేక శేఖర్ అనే రైతు క్షేత్రంలో చేపట్టారు. పంట కోత ప్రయోగంతో ఎకరానికి వచ్చే దిగుబడిని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో దిగుబడులను అంచనా వేయొచ్చని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలో రైతులపంటలకు ఆశించిన చీడ పీడల నివారణకు సలహాలు, సూచనలు అందించారు . ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయి చరణ్, రైతులు మేక శేకర్, ఫని, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కుమ్మన్‌పల్లిలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

సాలురా మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అమలు చేసే 6 గ్యారంటీ స్కీమ్‌లను ఇంటింటికి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసరావు, మంధర్న రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారు పోశెట్టికి పరామర్శ


బండారు పోశెట్టి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారు పోశెట్టి కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, జిల్లా నాయకులు గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సెప్టెంబర్ 29న బండారి పోశెట్టి తల్లి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి ఎమ్మార్పీఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సీనియర్ నాయకులు గంధమాల నాగభూషణం, డల్ల సురేష్, లక్ష్మీ గారి భూమయ్య ఆకారం రమేష్, సాకినిగారి సాయిలు, గుర్రాల పోశెట్టి, ధర్పల్లి సాయిలు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థిని భవానీ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన అంజలి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు గురువారం పాఠశాల ప్రత్యేక అధికారిని గరిగే భవానీ తెలిపారు. ఈనెల 8వ తేదీన జడ్పీహెచ్ఎస్ ఇందల్వాయిలో నిర్వహించిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఖోఖో పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు భవాని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఈ నెల 12 నుంచి 13 వరకు వనపర్తి జిల్లాలోని జడ్పీహెచ్ఎస్ సోలిపూర్‌లో నిర్వహించే 67వ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటున్నట్లు పాఠశాల పిఈటి స్రవంతి తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణిని పాఠశాల ఉపాధ్యాయినీ బృందం అభినందించారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మేడపాటి


కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన బాలవ్వ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. దాంతో గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం భూలక్ష్మీ క్యాంప్‌లో హొటల్ వద్ద చారి పేచర్చ నిర్వహించారు. సమీపంలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట బోధన్ మండల అధ్యక్షులు మనోహర్, పోశెట్టి, సాయిరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పంట కాలువల మరమ్మతులపై చర్చించిన రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో చెరువు నుంచి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించే విషయంలో స్థానిక రైతులు గ్రామ పంచాయతీ ఆవరణలో చర్చించారు. చేతికి వచ్చిన పంటను కాపాడుకోవడానికి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 25 వేల రూపాయలను ఖర్చు చేసి పంట కాలువ మరమ్మతులను చేపట్టాలని తీర్మానించారు. దీని ద్వారా సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు మౌలానా, వెల్మల నరసయ్య, జి .సాయి రెడ్డి, లింగాల అబ్బన్న లింగారెడ్డి, నారాయణరెడ్డి, స్థానిక రైతన్నలు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల పోరాటం ఉద్రిక్తం

- **పోలీసులకు నాయకులకు వాగ్వాదం**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బోర్గాం (పి) శివారు ప్రభుత్వ భూముల్లో సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న భూ ఆక్రమణ ఉద్రిక్తంగా మారింది. నిజామాబాద్ ఏసిపి, మోపాల్ సిఐ, రూరల్ ఎస్ఐ, రెవెన్యూ అధికారులు పేదలు ఆక్రమించుకున్న స్థలానికి వచ్చి స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. కానీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చేవరకు ఖాళీ చేసేది లేదని భీష్మించారు. పోలీసులకు నాయకులకు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఉద్రిక్తతల నడుమ పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి నాలుగోటౌన్ పోలీస్ స్టేషనుకు తరలించారు. దీంతో నిరుపేదలందరూ నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న నిరుపేదలకు కనీసం ఇళ్లస్థలాలను ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తుంటే కన్నెత్తి చూడని అధికారులు, పేదలు ఇళ్ల స్థలాలు అడిగితే ఓర్చుకోలేకపోతున్నారన్నారు. అందువల్లే నిరుపేదలను, వారికి మద్దతుగా పోరాడుతున్న సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేశారన్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల నుండి ప్రభుత్వ భూములను విడిపించాలన్నారు. అరెస్టులతో కేసులతో ఇళ్ల స్థలాల పోరాటం ఆపేది లేదని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని, అరెస్టులతో కేసులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. అరెస్టైన నాయకులను పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఆల్గోట్ రవీందర్, ప్రగతిశీల మహిళా సంఘం (సిఎల్పి) జిల్లా ప్రధానకార్యదర్శి కే.సంధ్యారాణి లు కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, సహాయ కార్యదర్శి సాయగౌడ్, నగర నాయకులు ముత్యాల నారాయణ, లక్ష్మి, మోపాల్ మండల కార్యదర్శి గంగమల్లు, అరుణోదయ నాయకులు గంగారం, స్థానిక నాయకులు రాజేష్, సుమలత, అమూల్య, అక్బర్, లలిత, పద్మ, లక్ష్మీ, నర్సింలు, గంగాధర్, సంతోష్ 250 మంది నిరుపేదలు తదితరులు పాల్గొన్నారు.


డిమాండ్ చేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుద్దాం

- **ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో బి.ఆర్.ఎస్‌లో చేరికలు**

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల నాయకత్వంలో నిజామాబాద్ నగరానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 200 మంది బి.ఆర్.ఎస్ పార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న యువత పెద్దఎత్తున బి.ఆర్.ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలియజేశారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకొనే పార్టీ బి.ఆర్.ఎస్ పార్టీ అని బి.ఆర్.ఎస్ పార్టీలో చేరిన వారందరికీ తామంతా రక్షణ కవచంలా ఉంటామని తెలిపారు. 60 ఏండ్లలో జరగని అభివృద్ధి బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 9 ఏండ్లలో చేసి చూపించామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, మాజీ నూడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బి.ఆర్.ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మల్లేష్ యాదవ్, ధర్మపురి, అంతరెడ్డి దేవి, బోడిగం నరేష్, బోడిగం ఆకాష్, బబ్బు, కరిపే రాజు, బోడిగం రాజశేఖర్, కోడిపాక రఘురామ్, సాయి కృష్ణ, క్రాంతి, రాము హాజరే, నరేష్, బోడిగం గోపి, ప్రకాష్, నగేష్, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలలను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కత్తితో గొంతు కోసుకొని యువకుడు ఆత్మహత్య


మృతుడి ఫైల్‌ఫోటో

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరి వాడిని అయ్యానని కారణంతో ఓ యువకుడు కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన రాపల్లి వెంకట్ (35) బుధవారం రాత్రి కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం స్థానిక కాలనీవాసులు చూసి మూడవ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకట్ మూడు సంవత్సరాల క్రితం వినాయక్‌నగర్‌కు చెందిన ఉషా అనే యువతిని వివాహం చేసుకున్నాడు. భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ కారణంగా సంవత్సరం క్రితం భార్య తల్లిగారింటికి వెళ్ళింది. ఆరు నెలల క్రితం తల్లి మరణించగా, కన్నవాళ్ళు, కట్టుకున్న భార్య లేకపోవడంతో ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి కత్తితో గొంతు కోసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇది చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ముగ్గురు అక్కా, చెల్లెలు ఉన్నారు.

పదోన్నతిపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదోన్నతిపై వచ్చి నూతనంగా బాధ్యతలు చేపట్టిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్నను మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన సాయన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పదోన్నతి పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉత్తమ సేవలు అందించి మరల ఈ పాఠశాలకు పదోన్నతిపై గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.వారి ఆధ్వర్యంలో పాఠశాలకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు పాలేపు నర్సయ్య, కన్వీనర్ నిమ్మ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి గుర్రం నరేష్, లెక్చరర్ సాయన్న, మండల కార్యవర్గ సభ్యులు మేకల క్రాంతి, వినయ్, దీపక్, యోగేష్, రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

టాటాఏస్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలైన యువకుడు

నవతెలంగాణ-ఎడపల్లి

నిలిపిఉంచిన టాటా ఏస్ లోడ్ వాహనం డోర్ ఆకస్మికంగా తీయడంతో వెనకాల నుంచి వస్తున్న మోటర్ సైకిల్ వాహనదారునికి డోర్ తగిలి తీవ్రంగా గాయపడ్డ ఘటన ఎడపల్లి మండల కేంద్రం శివారులోని సాటాపూర్ గేటువద్ద చోటు చేసుకొంది. స్థానికుల సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన శాల సుధాకర్ అనే వ్యక్తి టిఎస్ 16ఈవై 6938 అనే నెంబరుగల బైక్ పై ఎడపల్లి నుండి నిజామాబాదు వైపు వెళుతున్నాడు. అదే క్రమంలో సాటాపూర్ గేటువద్ద బోధన్-నిజామాబాదు ప్రధాన రహదారిపై ఏపీ 25ఎక్స్ 2240 టాటా ఏస్ అనేవాహనాన్ని నిలిపి ఉంచారు. టాటా ఏస్ డ్రైవర్ ఒక్కసారిగా డోర్ తీయడంతో వెనకాల వస్తున్న సుధాకర్ బైక్‌డోర్‌కు తగిలి పల్టీలు కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకొన్న ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో సుధాకర్ తలకు తీవ్రంగా గాయాలై రక్త స్రావం కావడంతో స్మృతి తప్పాడు. బైక్‌పై వెళుతున్న సుధాకర్ తలకు హెల్మెట్ ధరించినా అతను కిందపడిపోగానే హెల్మెట్ ఎగిరిపోవడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. సుధాకర్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది.

వెల్‌నెస్ సెంటర్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

వెల్నెస్ సెంటర్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, ఎంప్లాయిస్, పెన్షనర్స్, జర్నలిస్టుల, హెల్త్ స్కీం పరిధిలోని వెల్నెస్ సెంటర్ నందు కార్డియాలజీ, గైనిక్, తదితర స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించి వెల్నెస్ సెంటర్‌ను పటిష్ట పరచాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఈ.హెచ్.ఎస్. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరేంద్ర కుమార్‌కి(హైదరాబాద్) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉన్న వెల్నెస్ సెంటర్ను మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్‌నకు మార్పుకు సంబంధించి వసతులు గురించి కలెక్టర్ తదితర జిల్లా స్థాయి అధికారులను కలిసేందుకు వారు నిజామాబాద్‌కు వచ్చారు. యూనియన్ ప్రతినిధులు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో మాట్లాడుతూ లబ్ధిదారులకు అన్ని రకాల టెస్టులను ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రులనందు నగదు రహితంగా టెస్టులు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. మున్సిపల్ కార్యాలయంలోనికి వెల్‌నెస్ సెంటర్ మార్పునకు సహకరించిన జిల్లా కలెక్టర్‌కు, అడిషనల్ కలెక్టర్‌కు, ప్రెస్‌క్లబ్ నాయకత్వానికి పెన్షనర్స్ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు, పట్టణ అధ్యక్షులు సిర్ప హనుమాన్లు, అందే సాయిలు, జిల్లా నాయకులు ఈవీఎల్ నారాయణ, లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.


వినతి పత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ బృందం

నూడా చైర్మన్‌కు మోటాడిరెడ్డి సంఘం సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

కాలూరు మోటాడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డికి రూరల్ మండలం కాలూరు గ్రామంలోని మోటాడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంఘం భవనంలో నూతనంగా నూడా చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా తమ సామజిక వర్గానికి చెందిన ఈగ సంజీవ్ రెడ్డిని గ్రామ మోటాడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘము అధ్యక్ష, కార్యదర్శులు జె.ప్రవీణ్ రెడ్డి, పి.గంగారెడ్డి, సంఘం సభ్యులు నూడా చైర్మన్‌ను తమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సంఘ సభ్యులను ఉద్దేశించి నూడా చైర్మన్ ఈగ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ఎమ్మెల్సీ కవిత, రూరల్ ఎంఎల్ఏ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో కృషి చేస్తానని అన్నారు. అలాగే గ్రామ సుందరీ కరణకు ఇప్పటికే గ్రామంలో మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం చెపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ భాగరెడ్డి, బోర్గం ఈగ శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచులు రాజేశ్వర్‌రెడ్డి, లచ్చరెడ్డి, గంగాధర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జిన్నా రాంరెడ్డి, లింబారెడ్డి, ఎన్నం లచ్చరెడ్డి, జిన్నా లింగారెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.


చైర్మెన్‌ను సన్మానిస్తున్న మోటాడిరెడ్డి సంఘం నాయకులు

వరి పంటకు దోమపోటు

- **ఆందోళనలో రైతులు**



నవతెలంగాణ-రెంజల్

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చింది అనుకున్న తరుణంలో దోమపోటు రావడంతో రైతన్నలు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సాటాపూర్ శివారుతో పాటు, నీలా శివారులో దోమపోటు ఉధృతి రోజురోజుకు పెరుగుతుండడంతో స్థానిక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వ్యవసాయ విస్తీర్ణ అధికారులు చేతికి వచ్చిన పంట పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వారు పేర్కొంటున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఇక చేతికి వస్తుందన్న తరుణంలో దోమపోటు రావడం రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. సంబంధిత వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యటించి రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న విజయసాయి కెమికల్ ల్యాబ్‌లో బుధవారం ప్రమాదవశాత్తు కెమికల్ డ్రమ్ పేలిపోవడంతో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. గాయాలు అయిన వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. మరణించిన వారి కుటుంబానికి నష్టపరిహారం, గాయాలైన వారికి ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు కంపెనీ యాజమాన్యం తెలిపింది.

బోర్గాంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్.. 45 వాహనాల సీజ్

- **బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్**

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని బోర్గంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్టు ఏసీపి కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ఉదయం 6 గంటల నుంచి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేయగా 45 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వాహనదారులు సరిపైన పత్రాలను దగ్గరగా ఉంచుకోవాలని, గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. రాబోవు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ పోలీసు యంత్రాంగానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్, ఎడపల్లి ఎస్సై విక్రం, రుద్రూర్ ఎస్సై నిరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు


గుడుంబ స్వాధీనం చేసుకున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిజామాబాద్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, గొల్లగుట్ట, చక్రధర్ నగర్ తండా, నాగరం తండాలలోని పలు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 600 లీటర్ల గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకంను ధ్వంసం చేసి కేసులు నమోదు చేసినట్లు నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ గురువారం తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య జీవితాన్ని గడిపితేనే.. వైద్య సేవకు అర్థం

● జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి లక్ష్మణ్

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజలు ఆరోగ్య జీవితాన్ని గడిపితేనే, వైద్యులు అందించే వైద్యానికి అర్థం ఉంటుందని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక వైద్యాధికారి రాహుల్ మాట్లాడుతూ.. ఆరోగ్యపరమైన సమాచారాన్ని వైద్య సిబ్బంది, ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయవలసిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్, సిబ్బంది భీం, జానకి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు


బోధన్: విజయసాయి హైస్కూల్లో బతుకమ్మ వేడుకలు


కమ్మర్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


ఎడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


డొంకేశ్వర్‌లో...

● ఆడిపాడిన విద్యార్థులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఎడపల్లి, ముప్కాల్, కమ్మర్‌పల్లి, డొంకేశ్వర్, మోపాల్, జక్రాన్‌పల్లి, మెండోరా, బోధన్, రెంజల్, ఆర్మూర్, బాల్కొండ, సదాశివనగర్, రామారెడ్డి, పిట్లం, భిక్కనూర్ తదితర మండలాల్లో వేడుకలు నిర్వహించారు.


ముప్కాల్‌లో...


పిట్లంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


రామారెడ్డిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గీరెడ్డి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పోసానిపేట సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీరెడ్డి మహేందర్‌రెడ్డిని గురువారం నియమించారు. జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నా రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాన్ని మహేందర్ రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు మరింత బాధ్యత పెరిగిందని, మరింత ఉత్సాహంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ మంత్రి షబ్బీర్ అలీకి, జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌కు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డికి, మండల పార్టీ అధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, నాయకుల ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి గురువారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కెసిఆర్ పోటీ చేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ మెజారిటీతో సీఎం కెసిఆర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, సీడీసి చైర్మన్ నర్సయ్య, సర్పంచ్ అంజలి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు నర్సరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత భారత దేశమే లక్ష్యం

నవతెలంగాణ-రాజంపేట్

బాల్యవివాహ రహిత భారతదేశం అనే లక్ష్యంతో సాధన సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ హై స్కూల్లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాధన సంస్థ డైరెక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలని, విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ పిల్లల చేత ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. అదేవిధంగా బాల్య వివాహాల నిర్మూలనపై సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ జడ్జి శ్రీదేవి, విశిష్ట అతిథులు పిడిఎం కోడ్ జడ్జ్ భార్గవి, డిడబ్ల్యుఓ బావయ్య, సిడబ్ల్యూసి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సిడబ్లుసి మెంబర్స్ స్వర్ణలత, కామారెడ్డి డిసిపిఓ స్రవంతి, కామారెడ్డి డిస్ట్రిక్ లేబర్ ఆఫీసర్ కమ్ముద్దిన్, ఎమ్మార్వో అనిల్, ఎంపీడీవో బాలకృష్ణన్, ఎంఈఓ రామస్వామి, బిబిఏ తలారి సత్యం, స్థానిక బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేరువేరు ఘటనల్లో ఇద్దరు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉరి వేసుకొని యువకుడు మరణించిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిశాంత్ (23) ఆటో డ్రైవర్, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. తన తమ్ముడు నితీన్ దొంగతనం కేసులో జైలుకు వెళ్లాడు. గత 15 రోజుల నుండి తమ్ముడు జైలుకు వెళ్లాడని బాధపడుతూ మానసికంగా కృంగిపోయి బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి ఇంటికి రాకపోయేసరికి గురువారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య..

మండలంలోని కంచర్ల గ్రామంలో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తిరుమల్‌రెడ్డి (45) గత కొంతకాలంగా చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా బాధపడుతూ బుధవారం రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్ద వెళ్ళి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

చదును చేసి గుట్టలను కబ్జా చేస్తున్న అక్రమార్కులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న గుట్టలు చాలా వరకు అక్రమార్కులు చేతిలో పడి కబ్జాలకు గురవుతున్నాయి. బిచ్కుంద మండల కేంద్రంలో గుట్టలలో అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడుతూ భూమిని చదును చేస్తూ భూకబ్జాసురులు యథేచ్ఛగా హద్దులు పాతి భూ కబ్జాలకు పాలు పడుతున్నారు. బిచ్కుంద మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న పాలగుండం గుట్టను చదును చేసి అధికారుల అనుమతులు లేకుండా హద్దులు పాతి అక్రమార్కులు భూకబ్జా చేశారు. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరైతే ఏకంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ ప్లాట్ల రూపేనా విక్రయాలు కూడా చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు అక్రమార్కుల కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఈ విషయం తన దృష్టికి రాలేదని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూస్తామని తహసిల్దార్ తెలిపారు.


గుట్టను చదును చేసిన దృశ్యం

సారంగాపూర్‌లోని వృత్తి విద్యా కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సాయిలు


ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సాయిలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగాపూర్ ఉపాధ్యాయ వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సాయిలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వైస్ ఛాన్సలర్ వాకటి కరుణకు, రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరికి ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే కళాశాలలో అన్నీ రికార్డులను, రూములను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అధ్యాపకులకు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా పెద్దెడ్ల నర్సింహులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కారదర్శిగా డిసిసి అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామకపత్రం అందుకున్నట్లు వైస్ ఎంపీపీ నర్సింహులు తెలిపారు. తన పై నమ్మకం ఉంచి కార్యదర్శిగా నియమించటం తనపై మరింత బాధ్యతను పెంచినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కి తనవంతు కృషి చేస్తానని అన్నారు.


నియామకపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గుండారం పాఠశాలలో పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని గుండారం హైస్కూల్లో దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్ రావు, పిఎసిఎస్ చైర్మన్ శ్రీధర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో నేడు బహిరంగ వేలం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాదవ్‌నగర్‌లోని సాయిబాబా మందిరంలో భక్తులు కొట్టిన కొబ్బరికాయ చిప్పలు పోగుచేసుకొనుటకు శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 15-10-2023 నుండి 13-10-2024 వరకు సంవత్సరం కాల పరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మోడేగాం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ నారాయణ శుక్రవారం అనారోగ్యంతో మరణించినట్లు గ్రామప్రజలు తెలిపారు.

సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరణ


వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేశ్వరి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్‌లో గురువారం వైస్ ప్రిన్సిపాల్‌గా సోషల్ వర్క్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో బాధితులు అప్పగించిన వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ, రిజిస్టర్ యాదగిరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం రాజేశ్వరి సోషల్ వర్క్ విభాగ హెడ్ ఆఫ్ ద డిపార్మెంట్‌గా పనిచేస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఐ.ఎస్.ఆర్.డి)స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ సంఘంలో ఓటు హక్కు పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని సూచించారు. ఐదు సంవత్సరాలు మనకు సేవ చేసే వ్యక్తిని ఎన్నుకునే ముందు అతని గురించి అన్ని విధాలుగా తెలుసుకుని ఓటు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు యస్ సవిత, సీసీ పబ్బ లింగం, స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, వీఓఏ, బుక్ కీపర్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిసి భోజన్న జయంతి

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిసి భోజన్న జయంతిని పట్టణంలోని పివిఆర్ భవన్ నందు గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ప్రొద్దుటూరు వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు గోర్తా రాజేందర్ సైతం వారి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పిసి భోజన్నగారి తనయుడు పింజ అభినవ్ రాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబాగౌడ్, ప్రచార కమిటీ సభ్యులు కోల వెంకటేష్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ, యూత్ కాంగ్రెస్ అఖిల్, కొంతం మురళి, మీర్ మజీద్, జిమ్మి రవి, అజ్జు, బట్టు శంకర్, రేగుళ్ల సత్యనారాయణ, వసీం ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఉపకార వేతనానికి తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి నుంచి 2022-23 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించినందుకుగాను, ఐదుగురు విద్యార్థినులు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఉపకారవేతనం-2023కి ఎంపిక అయినట్టు తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు డిగ్రీలో ప్రతీ సంవత్సరం రూ.10,000ల చొప్పున మూడు సంవత్సరాలకి 30,000లు, పీజీలో రెండు సంవత్సరాలకు కలిపి 40,000లు, మొత్తంగా డిగ్రీ, పీజీ కలిపి 70,000 ల ఉపకారవేతనం పొందనున్నారు. ఈ సందర్భంగా ఉపకారవేతనం పొందిన విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీస్ కానిస్టేబుల్ సర్టిఫికేషన్ వెరిఫికేషన్


సర్టిఫికేషన్ వేరిఫికేషన్‌లో పాల్గొన్న అభ్యర్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియను ఇంచార్జీ పోలీస్ కమిషనర్ అదనపు డి.సి.పి (లా అండ్ ఆర్డర్) ఎస్.జయ్‌రామ్ ఆదేశాల మేరకు నోడల్ అధికారి సి.సి.ఆర్.బి ఎ.సి.పిఎ. రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్ యందు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటి రోజు 400ల మంది అభ్యర్థులను పిలవగా అందులో 390 మంది అభ్యర్దులు హజరు కాగా వారి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ ఎ.సి.పి నారాయణ, పరిపాలన అధికారి (ఎ.ఓ) బి.శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, సి.పి.ఓ కార్యాలయం సిబ్బంది, రిజర్వు విభాగం సిబ్బంది ఐ.టి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా వస్తువుల పంపిణీ


విద్యార్థులకు క్రీడా వస్తులు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు అధ్యక్షులు మోహన్ దాస్ గురువారం నోట్ బుక్స్, క్రీడా వస్తువులు, వాలీబాల్స్, టెన్ని కాయిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు ఈ వస్తువులను పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చెరుకు ప్రీథ్వీ రాజ్, పాస్ట్ ప్రెసిడెంట్స్ చెన్న రవి, ఏం.రాజన్న, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ దేవారం, పిడి గంగాధర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర సరిహద్దు కందకుర్తి చెక్ పోస్ట్ వద్ద ముమ్మర తనిఖీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలను చేపట్టారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికారులు చెక్‌పోస్టుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులతోపాటు ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఉన్నారు.



తనిఖీ చేస్తున్న పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు